nipuna
Every Wednesday Free Supplement
05.
13 మార్చి 2024
పేజీలు 8

### మరాఠాలకు రిజర్వేషన్

విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మహారాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ సునీల్ బి. షుక్రే నేతృత్వంలో వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచన మేరకు రిజర్వేషన్లను కల్పించారు. ఈ నిర్ణయంతో 50 శాతం పరిమితిని ఆ రాష్ట్రం దాటింది. అయితే 'అనూహ్య పరిస్థితి' ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చట్టంలో పేర్కొన్నారు.

# కొలువులు కొల్లగొట్టి



## నాలుగు ఉద్యోగాలు



టి.హరిత

**కుటుంబ నేపథ్యం?**

మాది నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల. భర్త ఉమామహేశ్వర శర్మ సాఫ్ట్‌వేర్. మాకు ఒక కూతురు. డిగ్రీ మహబూబ్‌నగర్, బీఈడీ వనస్థలిపురంలో పూర్తి చేశాను.

**ప్రిపరేషన్ ఎలా కొనసాగింది, సాధించిన ఉద్యోగాలెన్ని?**

2018లో 3 మార్కులతో పీజీటీ ఫిజికల్ సైన్స్ జాబ్ మిస్సయ్యింది. రెండు నెలల ప్రిపరేషన్‌లోనే కటాఫ్ దగ్గరకొచ్చావని, ప్రిపరేషన్ కొనసాగించాలని మా ఆయన ప్రోత్సహించారు. అంతకుముందు 2014-16 వరకు బేగంపేట ఉమెన్స్ కాలేజీలో కెమిస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేశాను. గతేడాది ఆగస్టులో జరిగిన పోటీ పరీక్షలకు నాలుగు నెలల ముందు నుంచి రోజూ 12 గంటలు చదివాను. కాలనీలో ఉన్న రీడింగ్ రూమ్‌లో రెండు నెలలు కూర్చున్నాను. తెలుగు అకాడమీ పుస్తకాలు, కోచింగ్ సెంటర్‌లో లభించిన రన్నింగ్ నోట్స్ బాగా ఉపయోగపడ్డాయి. యూట్యూబ్‌లో ఆన్‌లైన్ టెస్ట్ పేపర్స్ ప్రాక్టీసు చేయడం అదనపు ఫలితాన్నిచ్చింది. సెకండ్ అటెంప్ట్‌లో గురుకుల జేఎల్ కెమిస్ట్రీ, పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ బయోలాజికల్ సైన్స్, టీజీటీ జనరల్ సైన్స్ ఉద్యోగాలు సాధించాను. జేఎల్ కెమిస్ట్రీ ఎంచుకున్నాను. ఉద్యోగ సాధనలో మెథడ్ 78, జీఎస్‌లో 42 మార్కులదే కీ రోల్.

**ఇంటి పనులు, చదువును ఎలా బ్యాలెన్స్ చేశారు?**

ఈ విషయంలో అమ్మానాన్న, అత్త, మామ, భర్త సహకారం మరువలేను. ప్రిపరేషన్ సమయంలో అన్నీ వాళ్లే చూసుకున్నారు. ఒత్తిడి అంటే ఏంటో తెలియనివ్వలేదు. చదివిన సబ్జెక్టును ప్రాక్టీస్ చేయడమే రిలీఫ్‌గా భావించేదాన్ని. ఇలాంటి సహకారం ఉంటే ఎవరైనా సరే అనుకున్నది సాధిస్తారనడంలో సందేహం లేదు.

**ఉద్యోగాలకు ప్రిపేరయ్యేవారికి మీ సలహాలు?**

నెగెటివ్ మార్కింగ్ విధానం ఉండటం వల్ల ఎక్కువ ప్రాక్టీస్ బిట్స్ సాధన చేయాలి. దీని వల్ల మార్కు కోల్పోయే ప్రమాదం ఉండదు. టైమ్ మేనేజ్‌మెంట్ కూడా తెలుస్తుంది. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు. నా దృష్టిలో పోటీ పరీక్షల్లో ఒక అవగాహన రావడం కోసమే కోచింగ్ అవసరం. సొంతంగా చదివినా ఉద్యోగం సాధించొచ్చు.

## ఒకేసారి ఐదు ఉద్యోగాలు

**కుటుంబ నేపథ్యం?**

- మాది మహబూబ్‌నగర్ జిల్లా, మల్కాపూర్ మండలం, కోయిలకొండ. అమ్మ లక్ష్మి, నాన్న జగల్‌రెడ్డి. భర్త కె.విశ్వేశ్వర్‌రెడ్డి BSNL టెలికం డిపార్ట్‌మెంట్‌లో జేటీవోగా విధులు నిర్వహిస్తున్నారు. మాకు ఇద్దరు కుమారులు. డిగ్రీ మహబూబ్‌నగర్‌లో, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో, ఎమ్మెస్సీ జువాలజీ దూరవిద్యలో పూర్తి చేశాను.

**ప్రిపరేషన్ ఎలా సాగింది, ఎన్ని ఉద్యోగాలు సాధించారు?**

- 2019 నుంచి ప్రిపేరయ్యాను. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ రోజూ 10 గంటలు చదివాను. దిల్‌సుఖ్‌నగర్‌లో కోచింగ్ వెళ్లాను. కానీ కెమిస్ట్రీకి మాత్రం సొంతంగానే ప్రిపేరయ్యాను. దీనికి తోడు టీచింగ్ అనుభవం ఉండటంతో చాలా ప్లస్ అయ్యింది. తెలుగు అకాడమీ పుస్తకాలు మంచి ఫలితాలిచ్చాయి. సెకండ్ అటెంప్ట్‌లో టీజీటీ బయోసైన్స్, టీజీటీ జనరల్ సైన్స్, పీజీటీ ఫిజికల్ సైన్స్, జేఎల్ కెమిస్ట్రీ, జేఎల్ జువాలజీ విభాగాల్లో ఐదు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. జేఎల్ కెమిస్ట్రీ ఎంచుకున్నా. ఇందులో మెథడ్‌లో 80.75 మార్కులు సాధించాను.

**ఫ్యామిలీని, ప్రిపరేషన్‌ను ఎలా హ్యాండిల్ చేశారు?**

- 2018లో టీజీటీ ఫిజికల్ సైన్స్ జాబ్ చేజారింది. అమ్మ, భర్త సహకారంతో చదివి ఇన్ని ఉద్యోగాలకు ఎంపికయ్యాను. అన్ని పనుల్లో చాలా సాయపడ్డారు. ఒక ఆడబిడ్డగా గర్వంగా ఉంది. రీడింగ్ రూమ్‌లో శ్రద్ధగా చదువుకునేలా చూసుకున్నారు. వారికి కృతజ్ఞతలు చెప్పి సరిపెట్టుకోలేను. నోటిఫికేషన్ సమయంలో నా కుమారుడికి అనారోగ్య కారణంగా 19 రోజులు ఆస్పత్రిలో ఉన్నాను. ఇదే నేను ఎదుర్కొన్న కష్ట సమయం.



కె. షర్మిళ

**ప్రస్తుతం ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఏం చెప్తారు?**

- ఓపికతో హార్డ్ వర్క్ చేయాలి. సిలబస్‌పై అవగాహన ఉండటం ప్రాథమిక చర్య. తెలుగు అకాడమీ బుక్స్ చదవాలి. సబ్జెక్టులను రివిజన్ చేయాలి. కోచింగ్ వెళ్లలేదనే భయం అవసరం లేదు. షార్ట్ నోట్స్ రాసుకుంటూ ప్రిపరేషన్ కొనసాగించాలి. విజయం అదే పలకరిస్తుంది.

## సెక్యూరిటీ జాబ్ చేస్తూ చదివా

**కుటుంబ నేపథ్యం?**

మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, పొన్కల్ మా స్వగ్రామం. అమ్మ పోచమ్మ బీడీ కార్మికురాలు. నాన్న పెద్దులు తాపీ మేస్త్రీ. అక్క, చెల్లెల పెళ్లిల్లు అయ్యాయి. 1-10వ తరగతి వరకు మంచిర్యాలలో చదివాను. డిగ్రీ జన్నారం, బీఈడీ, ఎంఈడీ, ఎంకాం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాను.

**ప్రిపరేషన్ ప్లాన్ ఏంటి, ఎన్ని ఉద్యోగాలకు ఎంపికయ్యారు?**

- నోటిఫికేషన్‌కు ముందు రోజూ 4 గంటలు, వచ్చాక 10-12 గంటలు పుస్తకాలతో కుస్తీ పట్టాను. అక్క, చెల్లెలు పెళ్లిల్ల కోసం అప్పులు అయ్యాయి. వాటిని తీర్చడం కోసం ఓయూలో ఐదేళ్ల పాటు సెక్యూరిటీ ఉద్యోగం చేస్తూ కేవలం రాత్రి సమయంలో చదివాను. తెలుగు అకాడమీ పుస్తకాలు, మెథడ్ కోసం ఇగ్నో బుక్స్ తిరగేశాను. సొంతంగానే ప్రిపేరయ్యాను. మెథడ్‌లో 68, కంటెంట్‌లో వచ్చిన 54 మార్కులు కీలకమయ్యాయి. టీజీటీ, పీజీటీ సోషల్, జేఎల్ కామర్స్ విభాగంలో ఎంపికయ్యాను. జేఎల్ కామర్స్ ఎంచుకున్నాను.

**గతంలో పోటీ పరీక్షలు రాశారా? మీకు స్ఫూర్తి ఎవరు?**

- 2013లో గ్రూప్-2 రాశాను. 2018 డీఎస్సీ సోషల్ 1/2 మార్కుతో చేజారింది.

అప్పుడే ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నాను. నా తల్లిదండ్రులను చూసే కష్టపడటం నేర్చుకున్నాను. వారే నాకు స్ఫూర్తి.

**ఉద్యోగార్థులకు ఏం చెప్తారు?**

- కోచింగ్ తప్పనిసరేం కాదు. పోటీ పరీక్షల అవగాహనకు మాత్రమే అవసరం. రెండు మూడు రకాల పుస్తకాలు చదివితే ఫలితం ఉండదు. ప్రామాణిక పుస్తకాలు ఫాలో అయితే ఫలితం మన కళ్లముందుంటది.

జి. ప్రవీణ్‌కుమార్

